

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## జిల్లా పరిషత్ అధికారుల సేవలు ప్రశంసనీయం

**- 38 మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న అధికారుల పనితీరు భేష్..**
**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** మోంథా తుఫాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సిబ్బంది అన్ని ముందస్తు చర్యలు తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా 38 మండలాల్లోని గ్రామాల ప్రజలకు సేవలు అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కొనియాడారు. ప్రస్తుత మోంథా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో గత తుఫాను అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలలో భాగంగా ఈసారి మరింత సమగ్ర ప్రణాళికలతో అధికారులు తుఫాన్‌కు ముందుగానే సిద్ధమయ్యారు. జిల్లాలోని 38 మండలాలలో వర్షపు నీరు నిలిచే 135 లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అందులో 119 లోతట్టు ప్రాంతాలలో నిల్వయున్న వర్షపు నీటిని 78 జేసీబీలను ఉపయోగించి రూ. 11.49 లక్షల వ్యయముతో 77 పనులను పూర్తి చేశారు . రాబోవు మోంథా తుఫాను సందర్భముగా సదరు లోతట్టు ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులు, డ్రైనేజీల్లో ఉన్న అడ్డంకులను తొలగించడం, అవసరమైతే వర్షపు నీళ్ల వెళ్ళడానికి కొత్తగా కాలువలు తీయడం లాంటి పనులు వేగవంతంగా పూర్తి చేశారు. అన్ని మండలాల్లో మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పరిషత్ అధికారులు చేపట్టిన ముందస్తు జాగ్రత్తల వల్ల ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా, విపత్తు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించేందుకు దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ అధికారులు పనిచేయడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ఇతర శాఖల అధికారులు విపత్తు సమయానికి ముందు, అనంతరం విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నిరంతర మార్గదర్శకత్వం, సూచనల మేరకు పనులు సమయానికి పూర్తి చేయగలిగామని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహన్ రావు తెలిపారు.

## డిఆర్ఓగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన ఎన్ విజయకుమార్






**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** జిల్లాలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా ఎన్ విజయకుమార్ విధులు నిర్వహిస్తుండగా గత కొంతకాలంగా జిల్లాకు జిల్లా రెవెన్యూ అధికారి లేకపోవడంతో ఇంచార్జ్ డిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న ఎన్ విజయకుమార్‌ను సోమవారం ప్రభుత్వ, ఉత్తర్వులు మేరకు జిల్లారెగ్యులర్ జిల్లా రెవెన్యూ అధికారిగా ఎన్‌విజయ్ కుమార్‌పూర్తి స్థాయి, బాధ్యతలు స్వీకరించారు.

### నేడు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు : కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** బంగాళాఖాతంలో ఏర్పడుతున్న మోంతా తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నెల 28న (మంగళవారం) అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు, అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, అక్టోబరు27 ,ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 35600 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 67.212టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 32650 కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం99.102మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలి

**- ముందస్తు నివారణ చర్యలతోనే మొంథా తుఫాను నష్టాన్ని నివారణ**
**- ఎటువంటి పరిస్థితికైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధం**
**- తుఫాను జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్**



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి తుపాన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన అప్రమత్తత చర్యలపై జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావం ఎలాగైనా వుండొచ్చని, ముందస్తు జాగ్రత్త చర్యలతోనే నష్టనివారణ సాధ్యమన్నారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, మెడికల్ అండ్ హెల్త్, ఐసిడిఎస్ శాఖల అధికారులు, సిబ్బందిగా చాలా అప్రమత్తంగా వుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ జిల్లాలో తుపాను నుంచి ప్రజలను రక్షించేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ ఒకటి, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఒక బృందాన్ని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ప్రజలకు సహాయం అందించేందుకు 24 గంటలు పనిచేసేలా కంట్రోలు రూంను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 0861 2331261, 7995576699 నెంబర్లలో ప్రజలు సహాయం కోసం ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో 9 తీర మండలాలు ఉండగా, వీటిలో 42 సెన్సిటివ్ గ్రామాలు, 166 హాబిటేషన్లు గుర్తించామన్నారు. తుఫాన్ ప్రభావం సమయంలో ప్రజలకు సురక్షిత ఆశ్రయం కల్పించేందుకు 144 రిలీఫ్ సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అవసరమైతే ఈ రిలీఫ్ కేంద్రాలను ఉపయోగించుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా 377 చౌక దుకాణాలతో రిలీఫ్ సెంటర్లను అనుసంధానించి, అవసరమైన పిడిఎస్ బియ్యం సరఫరా దాదాపు పూర్తయిందని తెలిపారు. పెన్నానది పరివాహక సమీప ప్రాంతాల్లో వరదలు ప్రభావం చూపే 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. తుపాన్ ప్రభావ సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని, ఎటువంటి ముప్పుకైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ విజయ్‌కుమార్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అధికారులందరూ అప్రమత్తంగా ఉండండి: జిల్లా కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** మోంతా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మోంతా తుఫాన్ ను ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం రాత్రి అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ఈ రోజు రాత్రి (సోమవారం) నుండి మంగళవారం ఉదయం వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, ప్రాజెక్టుల వద్ద నిరంతరం గస్తీ ఉండేలా సిబ్బంది ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నందు సిబ్బంది ..తమకు కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంటే వెంటనే సమీపంలో ఉన్న పునరావాస కేంద్రాల్లోకి తరలించాలన్నారు. ఈ కేంద్రాల్లో ఉన్నవారికి ఎటువంటి లోటు పాట్లు లేకుండా మంచి భోజనం, తాగునీరు, బెడ్స్ ఇవ్వాలన్నారు. జిల్లాలో ఏ చిన్న సమస్య వచ్చినా ఏ సమయంలో అయినా నేరుగా తనకే ఫోన్ చేసి చెప్పాలని కలెక్టర్ అన్నారు. సోమశిల, టిజిపి, చెరువుల ప్రస్తుత పరిస్థితిని ఆయా శాఖాధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు కలెక్టర్ జారీచేశారు. ఈ వర్షాల వల్ల కూరగాయలు,పాలు,తాగునీరు, రేషన్ లకు ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్,

## పునరావాస కేంద్రాల్లో వారికి ఆహారం అందజేత



**ఇందుకూరుపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన కాలనీ నందు తుఫాన్ భారీ వర్షాల కారణంగా గ్రిల్ పునరా వాస కేంద్రంలోపెట్టి వారికి ఆహారం, మంచినీళ్ల వసతి కల్పించి సౌకర్యా లు ఏర్పాటు చేయడం జరిగింది. పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, ఉప సర్పంచ్ వెంకట రమణారెడ్డి, చాముం డేశ్వరి, టెంపుల్ చైర్మన్ కొండల కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది శివ పాల్గొని వారికి ఆహారం ఏర్పాటు చేయడం జరిగింది.

## బస్సు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు





**వింజమూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త** కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బెంగుళూరుకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో సజీవ దహనమైన గోళ్ళ రమేష్ కుటుంబ సభ్యుల మృతదేహాలు ఆదివారం రాత్రికి గోళ్ళవారిపల్లికి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వచ్చాయి. సోమవారం ఉదయం జరిగిన అంతిమ యాత్రలో మృతులు గోళ్ళ రమేష్, అనూష, శశాంత్, మన్విత్‌లకు అశ్రునయనాలతో ఘనంగా కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. బస్సు ప్రమాద ఘటన తెలిసినప్పటి నుండి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వయంగా గొళ్ళవారిపల్లి గ్రామానికి వెళ్లి గోళ్ళ రమేష్ తండ్రి మాలకొండయ్యకు ధైర్యం కల్పిస్తూ అండగా అక్కడే ఉండి మృతదేహాలను స్వగ్రామంకు తీసుకొని వచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి అటు పార్టీ పెద్దలు దృష్టికి రమేష్ కుటుంబ పరిస్థితి వివరించి ఇటు జిల్లా నాయకులతో ప్రమాద ఘటన వివరిస్తూ వారి కుటుంబంలో ఒక్కడిగా వ్యవహారించిన ఎమ్మెల్యే తీరు గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆదివారం రాత్రి కర్నూలు నుండి ప్రత్యేక అంబులెన్స్‌లో బయలుదేరిన మృతదేహాలు వస్తున్నాయని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గొళ్ళవారిపల్లి గ్రామంలో మృతదేహాలను రాత్రికి ఉంచేందుకు మృతుడు ఇంటి వద్ద ఐస్ బాక్సులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా సోమవారం ఖననం చేసే ప్రాంతం శుభ్రం చేయించాడు. ప్రమాద సంఘటన జరిగిన రోజు నుండి చివరి అంతిమ యాత్ర వరకు అన్ని ఖర్చులు ఎమ్మెల్యే భరించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెబుతూ గ్రామస్తులు అందరూ కూడా వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. సోమవారం అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో జనాలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గొళ్ళవారిపల్లిలో దు:ఖ వాతావరణం నెలకొంది. సోమవారం జరిగిన రమేష్ కుటుంబ సభ్యుల అంతిమ యాత్రలో ఎమ్మెల్యే పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు. రమేష్ కుటుం బానికి అన్ని విధాల ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను మానసికంగా తీవ్రంగా కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టం ఏ ఒక్క కుటుంబానికి కలగ కూడదని దేవుని ప్రార్థిస్తున్నాం అన్నారు. మృతుడు కుటుంబ సభ్యులకు అం డగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. గోళ్ళ మాల కొండయ్య కుటుంబానికి పార్టీ నుండి పది లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు. అలాగే కాకర్ల చారిటబుల్ ట్రస్టు నుండి మూడు లక్షల రూపా యలు ఆర్థిక సాయం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ట్రస్టు నుండి రూ.5లక్షలు ఆర్థిక సాయం, అలాగే మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వర్ణ భారతి ట్రస్టు ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మరికొంత ఆర్థిక సహాయం అందనుందన్నారు. ఆర్థిక పరంగా మాలకొండ కుటుంబానికి భరోసా కొంత కలిగినప్పటికి, కుటుంబ సభ్యులు కోల్పోయిన లోటును తీర్చలేనిదన్నారు. వారి కుటుంబాన్ని అన్ని వి దాల ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. ప్రత్యేకంగా పోలీసు వారికి మీడియా మిత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. అంతి మయాత్రలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, ఎంపీపీ ఇనగనూరి మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కోదూరు నాగిరెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి సల్లా శ్రీనివాసులు యాదవ్, కే.శ్రీనివాసులు నాయుడు, జనసేన అధ్యక్షులు బండారు సత్యనారాయణ, బీజేపీ పార్టీ నాయకులు, స్థానిక తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, గ్రామస్తులు, గోళ్ళ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము

**- అనుమతులు లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు**
**- కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 27,ప్రభాతవార్త:** మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి 4 వార్డులకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు వరద ముంపుకు గుంయ్యే ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేశారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులను ఒక్కో బృందంలో సభ్యులుగా ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో పదిమంది సహాయకులను నియమించామని తెలిపారు. బృందాలతో భారీ వర్షాలకు వరద ముంపు ప్రాంతాలను గుర్తించి వరద నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలను తీసుకునేందుకు సంసిద్ధం చేశామని తెలిపారు. నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల్లో 14 వరద సహాయక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన అన్ని వసతులను కేంద్రాలలో కల్పించనున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. పట్టణ పురపాలక పి. నారాయణ ఆలోచనల మేరకు వార్డు సచివాలయ కార్యదర్శులు అందరూ సహాయక చర్యలో పాల్గొనేందుకు సంసిద్ధంగా ఉన్నారని, సచివాలయం పరిధిలో అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో సహాయక చర్యలు అందించనున్నారని కమిషనర్ తెలిపారు .మంత్రి పి.నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిల ఆలోచనలతో ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి ప్రారం భించిన డ్రైను కాలువల పూడికతీత పనుల వలన నగరవ్యాప్తంగా వర్షపు నీరు ఎక్కడ నిల్వ ఉండ కుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. భారీ వర్షాలకు సైతం వరద నీరు సాఫీగా ప్రవహించేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. తుఫాను నేపథ్యంలో వరద ప్రభావానికి గురై ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ భాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్లు 0861 2356777, 0861 2316777 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందగలరని కమిషనర్ సూచించారు.

**- అనుమతులు లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు, చిన్న లాలీపాప్ ల ఏర్పాటును పూరి స్థాయిలో నిషేధించి ఉన్నామని, అనుమతులు లేకుండా ఎవరైనా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వై.ఓ నందన్ హెచ్చరించారు.పట్టణ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సంయుక్త ఆలోచనలతో ఫ్లెక్సీ ఫ్రీ/ పోస్టర్ ఫ్రీ సిటీ నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించి పటిష్టంగా అమలు చేయనున్నామని కమిషనర్ తెలిపారు.నగర సుందరీకరణకు అవరోధంగా డివైడర్ ల మధ్యలో అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని, నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడైనా ఫ్లెక్సీల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరి అని కమిషనర్ స్పష్టం చేశారు. అనుమతులు పొందిన ఫ్లెక్సీలు కూడా 48 గంటలలోపే తొలగిం చేయాలని సూచించారు.

అదేవిధంగా అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లను అంటించడం కూడా చట్ట వ్యతిరేకమని, కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.ఫ్లెక్సీలు ప్రింట్ చేసే ప్రింటర్ నిర్వాహకులు ముందస్తుగా కార్పొరేషన్ అనుమతులను పరిశీలించినతర్వాతే ఫ్లెక్సీలు ముద్రిం చే పనులను చేపట్టాలని కమిషనర్ సూచించారు.


## మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** మొంథా తుఫాన్ నేపథ్యంలో నెల్లూరు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండనున్న తరుణంలో రక్షణ చర్యలతోనే నష్టాన్ని తగ్గించవచ్చని ఆయన తెలిపారు. అధికారులు కూడా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని అన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మెడికల్ అండ్ హెల్త్, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిసామని పేర్కొన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టిందని, రాష్ట్ర వ్యాప్తంగా సహాయక చర్యల కోసం రూ.19కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రజలకు సహాయం అందించేందుకు 24 గంటలు పని చేసేలా జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 0861-2331261, 7995576699 నెంబర్లలో ప్రజలు సహాయం కోసం ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకవద్దని, రహదారులపై ప్రయాణించే సమయంలో మాన్‌హోల్స్, డ్రైనేజీల పట్ల జాగ్రత్తగాఉండాలన్నారు. పాత గోడలు కూలే ప్రమాదం ఉన్నఇళ్లలో ఉండొద్దని, వర్షంసమయంలో చెట్లకింద నిలబడవద్దని పేర్కొన్నారు. పెన్నా నది పరివాహక సమీప ప్రాంతాల్లోని ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలి

**- నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను పరిశీలించిన జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్**



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** మొంథా తుఫాను నేపథ్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని, కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ ఆదేశించారు. సోమవారం మొంథా తుఫాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు నియమించిన ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులతో సమీక్షాసమావేశానికి ముందు ప్రజలకు సహాయం అందించేందుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని, సమస్యను పూర్తిగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సిబ్బందికి సూచిం చారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలో కంట్రోల్ రూంతో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని ప్రజలకు సూచించామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక అధికారి యువరాజ్‌కు తెలిపారు.

**జిల్లా కలెక్టరు కార్యాలయంతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు**

**నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కంట్రోలు రూం నెంబర్లు : 0861 2331261, 7995576699**
**కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం: 7601002776**
**ఆర్డీవో కార్యాలయం, నెల్లూరు : 9849904061**
**ఆర్డీవో కార్యాలయం, ఆత్మకూరు : 9100948215**
**ఆర్డీవో కార్యాలయం, కావలి : 7702267559**

